ప్రజాశక్తి



సోమవారం 30 సెప్టెంబర్ 2024

5

అల్లూరి సీతారామరాజు

మన్యంలో ఆగని శిశు మరణాలు



శిశువు మృతదేహం

ప్రజాశక్తి-జి.మాడుగుల: మండలంలో బోయితీల పంచాయతీ పులుసుమామిడి గ్రామంలో ఇటీవల కాలంలో వారం రోజుల వ్యవధిలో ఒకే గ్రామంలో అనారోగ్యానికి గురై ఇద్దరు చిన్నారులు మృతి చెందారు. ఈనెల 22న తోటపల్లి లక్ష్మీపతికి చెందిన నాలుగు నెలల పాప మృతి చెందింది. ఆదివారం అదే గ్రామానికి చెందిన తెరాడా రమేష్ కి చెందిన మూడు నెలల బాబు మృతి చెందాడు. స్థానిక సర్పంచ్ లసంగి మాలన్న స్థానిక విలేకరులతో మాట్లాడుతూ, వైద్య ఉన్నతాధికారులు, సిబ్బంది స్పందించి పలు జాగ్రత్తలు తీసుకోవాలని కోరారు. ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా చూడాలన్నారు.

కొట్టుకుపోయిన కల్వర్టు

-పలు గ్రామాలకు నిలిచిన రాకపోకలు
-అవస్థలు పడుతున్న గిరిజనులు



భారీ వర్షానికి కొట్టుకు పోయిన కల్వర్టు

ప్రజాశక్తి- అనంతగిరి రూరల్, అనంతగిరి: శనివారం రాత్రి కురిసిన భారీ వర్షానికి మండలంలోని పినకోట పంచాయతీలో కల్వర్టు కొట్టుకుపోయింది. దీంతో సుమారు 15 గ్రామాలకు రాకపోకలు నిలిచి పోయాయి. ఇటీవల కురుస్తున్న భారీ వర్షాలకు గ్రామ రహదారులన్నీ పూర్తిగా కొట్టుకుపోయి కొన్ని చోట్ల రాళ్లు తేలి ఉన్నాయి. మరికొన్ని చోట్ల గండి కొట్టుకు పోవడంతో గిరిజన గ్రామాలకు చేరుకోవాలంటే నరకయాతన పడాల్సిన పరిస్థితి ఏర్పడింది. శనివారం రాత్రి కురిసిన భారీ వర్షానికి పినకోట పంచాయతీ గడ్డిబంధ చిడిమెట్ట బోనూరు గ్రామాలకు వెళ్లే రహదారిలో నిర్మిస్తున్న కల్వర్టును వరద నీటితో కొట్టుకు పోవడంతో మారుమూల 15 గ్రామాలకు రాకపోకలు నిలిచిపోయాయి. అత్యవసర సమయాల్లో అంబులెన్స్ కూడా వెళ్లలేని పరిస్థితి ఏర్పడిందని పినకోట పంచాయతీ వాసులు వాపోతున్నారు.

ఈ సందర్భంగా పినకోట సర్పంచ్ ఎస్.గణేష్ ,పెద్దకోట మాజీ సర్పంచ్ జే.దేముడులు మాట్లాడుతూ, తమ పంచాయతీలు మండల కేంద్రానికి సుమారు 120 కిలోమీటర్ల దూరంలో ఉండటంతో ఇటు మండలాధికారులు, అటు ప్రభుత్వం తమ గ్రామాల అభివృద్ధికి దృష్టి సారించలేదన్నారు. దీంతో, మారుమూల గిరిజన గ్రామాల అభివృద్ధి కుంటుపడుతుందని వారు తెలిపారు. అత్యవసర సమయాల్లో కాలినడకన డోలి మోతలు మోసుకొని తీసుకు వెళ్లాల్సిన పరిస్థితి ఏర్పడిందన్నారు. కొన్ని సందర్భాల్లో కాలినడకన తీసుకువెళ్లడంతో సకాలంలో వైద్యం అందక దారిలోనే ప్రాణాలు విడిచి పెడుతున్న సందర్భాలు ఉన్నాయని వారు ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి తక్షణమే గడ్డిబంధ చిడిమెట్ట మధ్యలో కల్వర్టు నిర్మాణం చేపట్టాలని పలు గ్రామాలకు చెందిన గిరిజనులు డిమాండ్ చేశారు .

వసతి గృహాల్లో సమస్యలు పరిష్కరించాలి

-జిఓ 3కు చట్టబద్ధత కల్పించాలి - ఎస్ఎఫ్ఐ రాష్ట్ర కార్యదర్శి ఎ.అశోక్



మాట్లాడుతున్న ఎస్ఎఫ్ఐ రాష్ట్ర కార్యదర్శి అశోక్

ప్రజాశక్తి-పాడేరు: గిరిజన సంక్షేమ విద్యాలయాలు, వసతి గృహాల్లో నెలకొన్న సమస్యలను తక్షణమే పరిష్కరించాలని ఎస్ఎఫ్ఐ రాష్ట్ర కార్యదర్శి ఏ.అశోక్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. అల్లూరి సీతారామరాజు జిల్లా కేంద్రం పాడేరులో ఎస్ఎఫ్ఐ జిల్లాస్థాయి విస్తృత స్థాయి సమావేశం ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు కె. కార్తీక్ శ్రీను అధ్యక్షతన ఆదివారం నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి ఎస్ఎఫ్ఐ రాష్ట్ర కార్యదర్శి ఎ.అశోక్ మాట్లాడుతూ, గిరిజన ప్రాంతంలో ఉన్న విద్యా సంస్థలలో అనేక సమస్యలతో గిరిజన విద్యార్థులు ఇబ్బందులకు గురవుతున్నారన్నారు. గిరిజన విద్యార్థుల సమస్యలు పరిష్కారం చేయడంలో ప్రభుత్వ అధికారులు, రాష్ట్ర ప్రభుత్వం విఫలమైందని విమర్శించారు. రోజు రోజుకు గిరిజన విద్యార్థులు మృత్యువాత పడుతున్నారని, సరైన పౌష్టికాహారం లేక అనారోగ్యం పాలవు తున్నారని తెలిపారు. గిరిజన ప్రభుత్వ పాఠశాల, కళాశాలలో, గురుకులాలలో హెల్త్ వాలంటీర్లను నియమించాలని డిమాండ్ చేశారు. గిరిజన ప్రాంతంలో ఉన్న విద్యా సంస్థలలో మెడికల్ క్యాంపులు నిర్వహించాలని, పెండింగ్‌లో ఉన్నటువంటి ఫీజు రియంబర్స్మెంట్ వెంటనే విడుదల చేయాలన్నారు. గిరిజన ప్రాంతంలో ఉన్న ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో చదువుతున్న విద్యార్థులకు ఎగ్జామ్, ట్యూషన్ ఫీజులు ఐటీడీఏ చెల్లించాలని డిమాండ్ చేశారు.

ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి పి. జీవన్‌కృష్ణ మాట్లాడుతూ, గిరిజన ప్రాంతంలో ఉన్న విద్యా సంస్థలలో స్థానికంగా ఉన్నటువంటి అధ్యాపకులను నియమించాలన్నారు. జీవో 3కు చట్టబద్ధత కల్పించాలని డిమాండ్ చేశారు. భవిష్యత్తులో విద్యార్థుల సమస్యల పై పోరాటం చేస్తామన్నారు. విద్యార్థుల సమస్యల పరిష్కారంలో అధికారులు, రాష్ట్ర ప్రభుత్వం నిర్లక్ష్య ధోరణి వ్యవహరిస్తుందని విమర్శించారు. అనంతపురంలో రాష్ట్ర విస్తత స్థాయి సమావేశాలు 4నుంచి 7 వరకు జరుగుతాయన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా నాయకులు పి.చిన్నారావు, పి.సింహాద్రి, పి.అన్నబాబు, జ్యోతి, కాంచల, ప్రసాద్, దిలీప్, గణేష్ కార్యకర్తలు పాల్గొన్నారు.



ఇదే జామగుడ పాఠశాల

ఉపాధ్యాయున్ని నియమించరూ...

- ఆటలకు పరిమితం అవుతున్న విద్యార్థులు
- పట్టించుకోని అధికారులు

ప్రజాశక్తి -అనంతగిరి: ప్రాథమిక ప్రైమరీ పాఠశాలలో చదివే విద్యార్థులకు విద్యాబోధన అందించే ఉపాధ్యాయుడు లేక విద్య కుంటు పడుతుంది. అల్లూరి జిల్లా ఏజెన్సీ గిరిజన ప్రాంతంలో ఈ దుస్థితి నెలకొంది. అనంతగిరి మండలం ఎగువశోభ పంచాయతీ జామగుడ జీటిడబ్ల్యూ ప్రాథమిక పాఠశాలకు 2024 విద్యా సంవత్సరంలో పాఠశాల ప్రారంభం నుండి నేటి వరకు పర్మినెంట్ ఉపాధ్యాయుడు లేక విద్యార్థులకు విద్యా బోధన అందలేదు. విద్యార్థులు పాఠశాల ఆవరణలో ఆటలు ఆడుకోవాల్సిన దుస్థితి నెలకొంది. ప్రస్తుతం పనిచేస్తున్న ఉపాధ్యాయుడు ఒక సవత్సరం లాంగ్ లీవ్ పెట్టడంతో విద్యార్థులకు విద్య అందని ద్రాక్షగా మిగిలింది. ఈ పాఠశాలలో కమలాపురం, జామగుడ గ్రామాలకు చెందిన 31 మంది విద్యార్థులు చదువుతున్నారు. ఉపాధ్యాయుడు లేక రోజంతా ఆటలు ఆడుకోవాల్సిన పరిస్థితి ఆ విద్యార్థులకు నెలకొంది. ఇప్పటికైనా పర్మినెంట్ ఉపాధ్యాయుడిని నియమించాలని విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు. భాషా వాలంటరీ ఉన్నప్పటికీ పాఠశాల నిర్వహణ కష్టంగా మారింది. ఉపాధ్యాయుడ్ని నియమించాలని మండల స్థాయి విద్యాశాఖ అధికారులకు పలుమార్లు విన్నవించినా పట్టించుకోలేదని తల్లిదండ్రులు వాపోయారు . మండల విద్యాశాఖ కార్యాలయం వద్ద విద్యార్థులతో ఆందోళన కార్యక్రమం చేపడతామని తల్లిదండ్రులు హెచ్చరించారు.

రోడ్డు క్లియరెన్స్ పనులపై హర్షం



జెసిబితో గొల్లపల్లి రహదారి క్లియరెన్స్ పనులు

ప్రజాశక్తి -సీలేరు: పాడేరు ఐటిడిఎ పిఒ వి.అభిషేక్ చొరవతో జీకే వీధి మండలం ఎ.దారకొండ పంచాయతీ గొల్లపల్లి గ్రామ రహదారిపై విరిగిపడ్డ కొండచరియలను క్లియరెన్స్ చేయడంపై స్థానికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఇటీవల కురిసిన భారీ వర్షాలు, తుఫాను కారణంగా రహదారిపై కొండ చరియలు విరిగిపడి రోడ్డు పూర్తిగా మూసుకుపోవడమే కాకుండా, కొన్నిచోట్ల గ్రావెల్ రోడ్డు కొట్టుకుపోయింది. దీంతో రాకపోకలకు వీలుకాకపోవడంతో ఈ మార్గంలో ప్రయాణించే ప్రజలు అనేక ఇబ్బందులకు గురయ్యారు.

దీనిపై ఎ.దారకొండ ఉపసర్పంచ్ మురళి, చంటిబాబు సమస్యను పాడేరు ఐటిడిఎ పిఒ అభిషేక్ దృష్టికి తీసుకువెళ్లి, రోడ్డును క్లియరెన్స్ చేయాలని విజ్ఞప్తి చేశారు. దీనిపై స్పందించిన పిఒ, తక్షణమే రహదారి క్లియరెన్స్ పనులు చేపట్టాలని సంబంధిత అధికారులకు ఆదేశించారు. పిఒ ఆదేశాలతో అధికారులు గొల్లపల్లి గ్రామ రహదారి పనులను శని, ఆదివారాల్లో జెసిబితో క్లియర్ చేశారు. రోడ్డుపై పేరుకుపోయిన మట్టిని తొలగించి, ఈ రహదారిలో రాకపోకలకు వీలుగా చర్యలు చేపట్టారు. గొల్లపల్లి, పెబ్బంపల్లి, తడకపల్లి గ్రామాలు కలుపుకొని పోయే రహదారి పనులు శరవేగంగా జరగడంతో ఆయా గ్రామాల ప్రజలు పిఒఅభిషేక్‌కు ధన్యవాదాలు తెలిపారు.

జామిగూడలో ప్రత్యేక వైద్య శిబిరం

గీతం మెడికల్ కాలేజీ ఆధ్వర్యంలో నిర్వహణ : 120 మందికి ఉచిత వైద్య సేవలు



రోగులకు వైద్యసేవలు అందిస్తున్న గీతం వైద్యులు

ప్రజాశక్తి-పాడేరు టౌన్: పాడేరు మండలంలో వనుగుపల్లి పంచాయతీ జామిగూడ గ్రామంలో గిరిజనులకు గీతం డిఎస్‌టిలో భాగంగా గీతం మెడికల్ కాలేజ్ ఆధ్వర్యంలో ఆదివారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. 120 మందికి ప్రత్యేక వైద్య సేవలు అందించారు. గీతం మెడికల్ కాలేజ్ వైద్య నిపునులు సాధారణ రోగులు, మహిళలు, వద్దులు, పిల్లలను పరీక్షించి ఉచితంగా మందులను పంపిణీ చేశారు. సీజనల్ వ్యాధుల బారిన పడకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. చీడిగడ్డ, డి.తామరపల్లి, కందమామిడి గ్రామాల నుంచి వైద్య శిబిరానికి వచ్చిన రోగులకు, గిరిజనులకు ఉచిత వైద్యంతో పాటు భోజన సదుపాయం కల్పించారు. ఈ కార్యక్రమంలో గీతం అసోసియేట్ ప్రొఫెసర్ ఐ.శరత్ బాబు, వైద్య నిపుణులు గైనకాలజిస్ట్ డా.సమిత, పీడియాట్రి డాక్టర్ చందన్, జనరల్ మెడిసిన్ డాక్టర్ సందీప్, సర్పంచ్ మీనాకుమారి, ఎంపిటిసి భానుమతి, గీతం డిఎస్‌టి ప్రాజెక్ట్ కోఆర్డినేటర్ డాక్టర్ కిరణ్, సిబ్బంది నాగేశ్వరరావు, గోపి పాల్గొన్నారు.



శంకుస్థాపన చేపడుతున్న సిపిఎం సర్పంచ్ సునీత

రచ్చబండ నిర్మాణానికి శంకుస్థాపన

ప్రజాశక్తి-డుంబ్రిగుడ: గ్రామ పంచాయతీ నిధులతో కంగారు సోలా గ్రామంలో రచ్చబండ నిర్మాణం చేపడుతున్నట్లు గసభ పంచాయితీ సిపిఎం సర్పంచ్ పి సునీత చెప్పారు. రచ్చబండ పనులను ఆదివారం ప్రారంభించిన ఆమె మాట్లాడుతూ, గ్రామ అబివృద్ధి, గ్రామంలో సమస్యలు చర్చించుటకు రచ్చబండ వేధిక కానుందని చెప్పారు. వీధి దీపాలు, పారిశుద్ధ్యం, అంగన్వాడీ భవనాల మరమ్మత్తు పనులు, తాగునీరు కోసం ఈసారి వచ్చిన నిధులతో అభివృద్ధి చేస్తున్నామని చెప్పారు. సుమారు రూ 10 లక్షలతో అభివృద్ధి పనులు చేపట్టుటకు శ్రీకారం చుట్టామని చెప్పారు. త్వరలోనే సిసి రోడ్లు, డ్రైనేజీల నిర్మాణం చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఎం నాయకులు పాంగి దొరబాబు, పాంగి రామారావు, గ్రామ పెద్దలు సోమేశ్, సుబ్బారావు, సీతన్న, డొంబు పాల్గొన్నారు.

200 మందికి వైద్య పరీక్షలు



రోగులను పరీక్షిస్తున్న వైద్యులు

ప్రజాశక్తి-రంపచోడవరం : రాజమండ్రి రామకృష్ణ మిషన్ గిరిజన సంచార వైద్యశాల ఆధ్వర్యంలో ఆదివారం వైద్య శిబిరం నిర్వహించినట్లు రామకృష్ణ మిషన్ కార్యదర్శి స్వామి పరిజ్ఞేయనందజీ మహారాజ్ తెలిపారు. డాక్టర్ టివి.సుబ్బారావు, డాక్టర్ రాయుడు శ్రీనివాస్, డాక్టర్ దాసిర ఉమామహేష్, డాక్టర్ ఎస్.సంపత్‌కుమార్ పాల్గొని 200మందికి వైద్య సేవలు అందించినట్లు స్వామీజీ తెలిపారు. వీరిలో 73మందికి రక్తపరీక్షలు, తొమ్మిది మందికి ఫిజియోథెరపీ, 10మందికి ఎక్స్‌రేలు చేసినట్లు స్వామీజీ తెలిపారు. రామకృష్ణ మిషన్ అందిస్తున్న వైద్యసేవలను సద్వినియోగం చేసుకోవాలని వైద్య శిబిరంలో క్యాంప్ కోఆర్డినేటర్ కానుమోను శ్రీనివాస్, సిబ్బంది పాల్గొన్నారు .రోగులు, సహాయకులకు భోజన సదుపాయం సమకూర్చారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరు దుర్మరణం

తాగిన మైకంలో బైక్‌ను ఢీకొట్టిన కారు డ్రైవర్
ఘటనాస్థలిలో ఒకరు, ఆసుపత్రికి వెళుతుండగా మరొకరు మృతి



రావణాపల్లి వద్ద రోడ్డు ప్రమాదం దృశ్యాలు

ప్రజాశక్తి -కొయ్యూరు: మండలంలోని రావణాపల్లి గ్రామ శివారులో బైక్‌ను రాంగ్‌రూట్‌లో వచ్చిన కారు ఢీకొన్న ఘటనలో ఆదివారం ఇద్దరు దుర్మరణం పాలయ్యారు. కొయ్యూరు ఎస్ఐ రామకృష్ణ తెలిపిన వివరాలివి.

రాజేంద్రపాలెం నుంచి అంబటి అప్పన్న (40) అనే వ్యక్తి బైక్‌పై వస్తుండగా, ఎదురుగా రాంగ్ రూట్‌లో వచ్చిన కారు ఢీకొనడంతో అప్పన్నతోపాటు బైక్‌పై వెనుక కూర్చున్న నర్సీపట్నం, ఎరకంపేట గ్రామానికి చెందిన యాదగిరి రాజు (55)అనే వ్యక్తి కూడా దుర్మరణం పాలయ్యాడు. మద్యం మత్తులో కారు డ్రైవర్ సత్తిబాబు రాంగ్‌రూట్‌లో వచ్చి ద్విచక్ర వాహనాన్ని ఢీకొనడంతో ఈ ప్రమాదం జరిగింది. కారు బలంగా ఢీకొట్టడంతో అప్పన్న రహదారిపై పడిపోగా, లిఫ్ట్ అడిగి బైక్ ఎక్కి వెనుక కూర్చున్న నర్సీపట్నం ప్రాంతంలోని ఎరకంపేట గ్రామానికి చెందిన యాదగిరి రాజుబాబు 15 అడుగుల లోయలోకి పడిపోయాడు. ఈ ప్రమాదంలో బైక్‌పై ప్రయాణిస్తున్న అప్పన్న, రాజుబాబు ఇద్దరికీ కాలు విరిగిపోయాయి. ప్రమాదంలో గాయపడిన రాజుబాబు సంఘటనాస్థలిలోనే మృత్యువాత పడ్డాడు. కాగా అప్పన్నను అంబులెన్స్‌లో కృష్ణదేవిపేట ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా, అక్కడ ప్రథమ చికిత్స అనంతరం వైద్యుల సూచనల మేరకు నర్సీపట్నం ఏరియా ఆసుపత్రికి తరలిస్తుండగా కృష్ణదేవిపేట గ్రామ శివారులో మార్గమధ్యలోనే మరణించాడు.కాగా రాజేంద్రపాలెం నుంచి అప్పన్న బైక్‌పై వస్తుండగా, మార్గమధ్యలో రాజబాబు అనే వ్యక్తి లిఫ్ట్ అడిగి బైక్ ఎక్కినట్లు సమాచారం. ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ రామకృష్ణ తెలిపారు.

విద్యుత్ కార్మికుల సమస్యలపై వినతి



సమస్యలపై వినతిపత్రం ఇస్తున్న యూనియన్ నేతలు

ప్రజాశక్తి -సీలేరు: తెలుగు నాడు విద్యుత్ కార్మిక సంఘం ఆదివారం విజయవాడలో నిర్వహించిన రాష్ట్ర కార్యవర్గం సర్వసభ్య సమావేశంలో పాల్గొని, పలుసమస్యలపై విన్నవించి, యూనియన్‌పరంగా పరిష్కారచర్యలు చేపట్టాలని కోరినట్లు తెలుగు నాడు కార్మిక సంఘం రీజినల్ కార్యదర్శి ఎస్. భాస్కర్ వెల్లడించారు. ఆదివారం స్థానిక విలేకరులతో మాట్లాడుతూ సర్వసభ్య సమావేశంలో. సీలేరులో ఎపి జెన్‌కో పరిధిలో చేస్తున్న ఉద్యోగులు కాంట్రాక్ట్ కార్మికులు ఎవరైనా మృతి చెందితే మృతదేహాన్ని భద్రపరచడానికి అవసరమైన ఏర్పాట్లు చేయాలని కోరారు. 12 మంది పీస్ వర్కర్లను కాంట్రాక్ట్ కార్మికులుగా పరిగణిస్తూ ఎపి జెన్‌కో జెన్కో యాజమాన్యం జిఒ జారీ చేసిందని, దాన్ని తక్షణమే జెన్‌కో అధికారులు అమలు చేసే దిశగా చర్యలు చేపట్టాలని కోరారు. అలాగే ఎపి జెన్‌కో ఆధ్వర్యంలో నడుస్తున్న భవ్య ఆసుపత్రిలో ఎక్స్‌రే ప్లాంట్ ఏర్పాటు చేసే విధంగా కృషి చేయాలని సమావేశం దృష్టి తీసుకువచ్చామన్నారు. సరైన రవాణా సౌకర్యంలేకపోవడంతో విద్యుత్ ఉద్యోగులకు, కాంట్రాక్ట్ కార్మికులకు బయోమెట్రిక్ హాజరు నుంచి మినహాయింపు ఇచ్చేలా ప్రభుత్వం నుంచి ఆదేశాలిచ్చే విధంగా చర్యలు చేపట్టాలని కోరారు. ప్రధాన సమస్యలపై డిమాండ్లతో కూడిన వినతిపత్రం తెలుగునాడు విద్యుత్ సంఘం రాష్ట్ర నాయకులకు అందజేశామన్నారు. సమావేశంలో స్థానిక తెలుగునాడు విద్యుత్ కార్మిక సంఘం బ్రాంచ్ అధ్యక్షులు రేఖ అప్పారావు, కాంట్రాక్ట్ కార్మికులు వరహాలు పాల్గొన్నారని తెలిపారు.

వైసిపి జిల్లా అధ్యక్షునికి అభినందన



విశ్వేశ్వరరాజును అభినందిస్తున్న వైసిపి నేతలు

ప్రజాశక్తి- కొయ్యూరు : వైసిపి అల్లూరి జిల్లా అధ్యక్షునిగా నియమితులైన పాడేరు ఎమ్మెల్యే మత్స్యరాస విశ్వేశ్వరరాజును కొయ్యూరు మండల వైసిపి నేతలు మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు. విశ్వేశ్వరరాజు హయాంలో అల్లూరి జిల్లాలో వైసిపి మరింత పురోభివృద్ధి సాధిస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. విశ్వేశ్వరరాజును కలిసిన వారిలో డౌనూరు ఎంపిటిసి అప్పారావు, పాడేరు నియోజకవర్గ ఎన్నికల బూత్ కమిటీ ఇన్‌ఛార్జి పోతురాజు, జిల్లా ఎగ్జిక్యూటివ్ మెంబర్స్ సూరిబాబు, గంగాధర్ శుభాకాంక్షలు తెలిపారు.

సమాచారం ఇవ్వకుండా గ్రామసభ నిర్వహణ

- బాధ్యులపై చర్యలకు వినతి



దుప్పిలివాడలో నిర్వహించిన గ్రామసభ (ఫైల్)

ప్రజాశక్తి -సీలేరు: జికె. వీధి మండలం దుప్పిలివాడ పంచాయతీలో నిర్వహించిన మన ఇళ్లు మన గౌరవం గ్రామసభకు పంచాయతీ పరిధిలోని గ్రామాల ప్రజలకు, కూటమి నేతలకు ఎటువంటి సమాచారం ఇవ్వకుండా తూతూమంత్రంగా నిర్వహించిన బాధ్యులపై చర్యలు తీసుకోవాలసిాలని జనసేన మండల నాయకుడు డొక్కు బాబు డిమాండ్ చేశారు. ఆదివారం విలేకర్లతో మాట్లాడుతూ, శనివారం పంచాయతీ కార్యదర్శి వెంకటరావు ఆధ్వర్యంలో నిర్వహించిన మన ఇళ్లు మన గౌరవం గ్రామసభలో ఇళ్ల నిర్మాణాలకు సంబంధించి లబ్ధిదారులకు సలహాలు, సూచనలు చేయడంతోపాటు లక్ష్యాలను పూర్తి చేసేందుకు వారికి అవగాహన కల్పించాల్సిన పరిస్థితుల్లో ఎవరికీ సమాచారం ఇవ్వకుండా గ్రామసభ నిర్వహణ వలన ప్రభుత్వం ఆశించే లక్ష్యం నెరవేరే పరిస్థితి లేదన్నారు. గత ప్రభుత్వ హయాంలో మంజూరైన ఇళ్లను వచ్చేఏడాది మార్చి నెలాఖరు నాటికి పూర్తి చేయాల్సి ఉండగా, ఆ సమాచారం లబ్ధిదారులకు చేరవేయకుంటే లక్ష్యం ఎలా పూర్తవుతుందని ప్రశ్నించారు. వెంటనే సంబంధిత ఉన్నతాధికారులు స్పందించి తగు చర్యలు తీసుకోవాలని కోరారు.

బోరు పనులకు శంకుస్థాపన


శంకుస్థాపన చేస్తున్న నాయకులు

ప్రజాశక్తి-హుకుంపేట: మండలంలోని బుర్జ పంచాయితీ మజ్జివలస గ్రామంలో నూతన బోరు నిర్మాణ పనులకు శంకుస్థాపనను ఆదివారం చేపట్టారు. జన సేన పార్టీ మండలం ఉపాధ్యక్షులు మజ్జి కృష్ణం రాజు కొబ్బరికాయ కొట్టి ప్రారంభించారు. అనంతరం వారు మాట్లాడుతూ గ్రామంలో తాగునీరు లేక ఇబ్బందులు పడుతుండటంతో పలుమార్లు అధికారులకు తెలియజేయడం జరిగిందని వారు పేర్కొన్నారు. పంచాయతీ నిధులు విడుదలతో ప్రతి గ్రామంలో అభివృద్ధి పనులు జరగుతున్నాయన్నారు. ఈ కార్యక్రమంలో జనసేన నాయకులు విజయ్ కుమార్, ఉదయ్ కిరణ్, మదన్ పాల్గొన్నారు

చట్ట ఉల్లంఘనతో నిర్వాసితులకు అన్యాయం

ప్రజాశక్తి -నక్కపల్లి:మండలం లో వైజాగ్ - చెన్నై ఇండస్ట్రియల్ కారిడార్ పేరుతో జరుగుతున్న భూసేకరణలో రెవెన్యూ, ఏపిఐఐసి అధికారులు 2013 భూ సేకరణ చట్టాన్ని ఉల్లంఘించి, న్యాయస్థానాలు తీర్పులను పట్టించుకోకుండా భూసేకరణ చేపట్టి నిర్వాసితులకు తీవ్ర అన్యాయం చేస్తున్నారని నాయకులు, నిర్వాసితులు ఆవేదన వ్యక్తం చేశారు. మండలంలోని చందనాడలో ఆదివారం నిర్వాసితులు సమావేశం ఏర్పాటు చేశారు. సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ఎం అప్పలరాజు, సర్పంచ్ భర్త తళ్ళ భార్గవ్, ఎంపీటీసీ సభ్యులు గంటా తిరుపతిరావు, నాయకులు అప్పలస్వామి, పుణ్యమంతుల బాబ్జి ,గోవింద్ తదితరులు నిర్వాసితుల సమస్యలపై చర్చించారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, ఈ ప్రాంతంలో భూసేకరణకు నోటిఫికేషన్ ఇచ్చి 14 సంవత్సరాలు అవుతున్నా నేటికీ ఒక్కసారి కూడా నిర్వాసితులతో ప్రభుత్వ అధికారులు చర్చలు జరపకపోవడం అన్యాయమన్నారు. ఇది పూర్తిగా చట్టాన్ని ఉల్లంఘించడమే అవుతుందన్నారు. ఇక్కడ ఏ విధమైన పరిశ్రమలు ఏర్పాటు చేస్తారో, నిర్వాసితులను ఎలా ఆదుకుంటారో, ప్యాకేజీ ఎంత చెల్లిస్తారో అనేది చర్చలు ద్వారా పరిష్కారం చూపకుండా అధికారులు ఏకపక్షంగా నిర్ణయాలు తీసుకుని నిర్వాసితులకు అన్యాయం చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు . 2016 వరకూ కోర్టు లో స్టే ఉండటంతో భూ సేకరణ ప్రక్రియ నిలిచిపోయిందని, అటువంటిది 2010ని ఆర్ అండ్ ఆర్ ప్యాకేజీకి ఎలా కటాఫ్ తేదీగా భావిస్తారని ప్రశ్నించారు. ఈ కార్యక్రమంలో నర్సింగరావు, రాజేష్, కృష్ణ, నూకరాజు, అప్పలరాజు, శ్రీను, చిన్న పాల్గొన్నారు.

టిడిపి సభ్యత్వాలు నమోదు చేయాలి

ప్రజాశక్తి -నక్కపల్లి: మండలంలోని క్రిష్ టౌన్ షిప్ హోం మంత్రి వంగలపూడి అనిత స్వగృహం వద్ద ఆదివారం టిడిపి సభ్యత్వ నమోదుపై అవగాహన కల్పించారు. పాయకరావుపేట నియోజకవర్గం నాలుగు మండలాలకు చెందిన టిడిపి నాయకులు హజరయ్యారు. తెలుగుదేశం పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి లాలం కాశీనాయుడు మాట్లాడుతూ, అక్టోబర్ 2 నుండి టిడిపి సభ్యత్వ నమోదు కార్యక్రమం ప్రారంభమవుతుందని, చురుగ్గా చేపట్టాలన్నారు. టీడీపీ కార్యకర్తలకు ప్రస్తుతం రూ. 2 లక్షలు ఉన్న ప్రమాద బీమాను రూ.5లక్షలకు పెంచారన్నారు. టెలిగ్రామ్, వాట్సాప్, గూగుల్ ద్వారా సభ్యత్వ నమోదు చేసుకోవచ్చని ఐ టిడిపి అనకాపల్లి జిల్లా అధ్యక్షులు భీమరశెట్టి శ్రీనివాస్ తెలిపారు. ఈ కార్యక్రమంలో టిడిపి మండల అధ్యక్షులు కొప్పిశెట్టి వెంకటేష్, పెద్దిరెడ్డి చిట్టిబాబు, అమలంకంటి అబద్ధం, జానకి శ్రీను, కొప్పిశెట్టి బుజ్జి పాల్గొన్నారు .

బత్తులను కలిసిన దళిత నాయకులు

ప్రజాశక్తి - మాడుగుల: రాష్ట్ర హౌసింగ్ కార్పోరేషన్ చైర్మన్ బత్తుల తాతయ్యబాబుని ఆదివారం దళిత నాయకులు కలిశారు. రాష్ట్ర టిడిపి ఎస్సీ సెల్ కార్యదర్శి మరువాడ ఈశ్వరరావు ఆధ్వర్యంలో మాడుగుల నియోజకవర్గ దళిత నాయకులు కలిసి పుష్పగుచ్చాన్ని అందించి శుభాకాంక్షలు తెలిపారు. అనకాపల్లి జిల్లా తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు బత్తులను అధిష్టానం గుర్తించి రాష్ట్ర హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ గా నియమించడం పట్ల హర్షం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఎస్సీ సెల్ కార్యదర్శి మరువాడ ఈశ్వరరావు, దళిత నాయకుడు వరహాల కోటి, టిడిపి నాయకులు, మాజీ సర్పంచ్ రేఖ వెంకటరమణ బాబు, గుమ్మాల అమ్మ తల్లి, జనసేన నాయకుడు కొండలరావు తదితర దళిత నాయకులు పాల్గొన్నారు.

సీతారాం ఏచూరికి ఘన నివాళి


నివాళులర్పిస్తున్న సిపిఎం నాయకులు

ప్రజాశక్తి-యంత్రాంగం

డుంబ్రిగుడ:మండలంలోని అర్మ పంచాయతీ బడిమల గ్రామంలో ఇటీవల మృతి చెందిన కామ్రేడ్ సీతారాం ఏచూరి చిత్రపటానికి సిపిఎం నేతలు పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఆదివారం శాఖ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భగా సిపిఎం నాయకులు ఎస్‌బి పోతురాజు మాట్లాడుతూ, బడిమెల గ్రామంలో 110కుటుంబాలు, 470 మంది జనాభా ఉండగా ప్రీ స్కూల్ చిన్నారులు సుమారు 70 మంది ఉన్నారన్నారు. అంగన్వాడీ భవనం లేక నందివలస అంగన్వాడీ కేంద్రం నుంచి పీడింగ్ పంపిణీ చేస్తున్నారన్నారు. ప్రభుత్వ యంత్రాంగం స్పందించి బడిమెల గ్రామంలో అంగన్వాడీ భవనం వెంటనే మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో మహిళా సంఘం జిల్లా నాయకురాలు పికుమారి, కె.రామకృష్ణ, టి రామారావు, టి సద్దు, వి స్వామినాద్ గోపీనాథ్ పాల్గొన్నారు.

జి మాడుగుల: మండలంలోని గేమ్మేలి పంచాయతీ చిన్న కొత్తూరు గ్రామంలో సిపిఎం శాఖ మహాసభ ఆదివారం నిర్వహించారు. కామ్రేడ్ సీతారాం ఏచూరి చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో సిపిఎం మండల కార్యదర్శి సాగిన ధర్మన్నపడాల్, నాయకులు సన్యాసిదొర, సంకయ్య, సత్తిబాబు పాల్గొన్నారు.

తాగునీటి సమస్యకు పరిష్కారం


కుళాయి నీటిని విడుదల చేస్తున్న నాయకులు

ప్రజాశక్తి - చింతపల్లి : మరమ్మత్తులకు గురైన తాగునీటి బోర్‌ను మరమ్మత్తులు నిర్వహించడంతో ఎర్రబంద గ్రామంలో తాగునీటి సమస్యకు తాత్కాలిక పరిష్కారం చూపడం జరిగిందని ఎర్రబొమ్మల ఎంపీటీసీ సభ్యుడు సేగ్గే సత్తిబాబు తెలిపారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ, గ్రామంలో నెలకొన్న సమస్యల పరిష్కారంలో అధికారులు సకాలంలో స్పందించ లేదన్నారు. గడచిన నాలుగు నెలలుగా గ్రామంలో సురక్షిత తాగునీరు అందించే బోర్ వెల్ మరమ్మతుకు గురైందన్నారు. దానిని మరమ్మతు నిర్వహించి వినియోగంలోకి తీసుకురావాలని అధికారులకు ఎన్నిసార్లు మొరపెట్టుకున్నా స్పందించలేదన్నారు. గ్రామస్తులు పడుతున్న ఇబ్బందిని చూసి ఆదివారం బోరు మరమ్మతు నిర్వహించి తాగునీటి సమస్యకు తాత్కాలిక పరిష్కారం చూపడం జరిగిందన్నారు.

మహాధర్నాను విజయవంతం చేయండి: సిఐటియు

ప్రజాశక్తి -అనంతగిరి: కాంట్రాక్ట్, అవుట్ సోర్సింగ్ కార్మికుల సమస్యలు పరిష్కారించాలని కోరుతూ పాడేరులో చేపటే ధర్నాను జయప్రదం చేయాలని సిఐటియు మండల కార్యదర్శి కిల్లో మోస్య డిమాండ్ చేశారు. ఆదివారం బొర్ర గుహల గైడ్ , సెక్యూరిటీ కార్మికులకు కరపత్రాలు అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ, ఈనెల 30వ తేదీన సిఐటియు పిలుపు మేరకు దేశవ్యాప్తంగా కాంట్రాక్ట్, అవుట్ సోర్సింగ్ కార్మికుల సమస్యలు పరిష్కారించాలని జిల్లా కేంద్రంలో చేపట్టే ధర్నా కు మండలంలో పని చేస్తున్న అన్ని రంగాల కార్మికులు పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. గతంలో జరిగిన ఒప్పందం ప్రకారం టూరిజం శాఖలో పని చేస్తున్న మేన్‌పవర్ కార్మికులకు కనీస వేతనాలు అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో టూరిజం యూనియన్ జిల్లా అధ్యక్షుడు రాజు, అప్పన్న పాల్గొన్నారు



కరపత్రాలు ఇస్తున్న నాయకులు

ఆర్‌డిఒను కలిసిన ఎంపిడిఒ

ప్రజాశక్తి -నక్కపల్లి

నర్సీపట్నం ఆర్‌డిఓ వివి రమణ ను నక్కపల్లి ఎంపీడీవో డి.సీతారామరాజు మర్యాద పూర్వకంగా కలిశారు. ఆర్‌డిఓగా రమణ ఇటీవల బాధ్యతలు స్వీకరించారు. గతంలో ఆయన నక్కపల్లి తహసీల్దార్ గా పనిచేశారు.ఈ మేరకు ఆర్డిఓ రమణను ఎంపీడీవో సీతారామరాజు మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలియజేశారు.

నేరాలు ఘోరాలు

అనుమానాస్పద స్థితిలో వ్యక్తి మృతి

ప్రజాశక్తి - చింతపల్లి : అనుమానాస్పద స్థితిలో గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందిన ఘటన మండలంలోని లోతుగెడ్డ జంక్షన్, చింతలూరు గ్రామాల సమీపంలో చోటుచేసుకుంది. పశువుల కాపుకు వెళ్ళిన పశువుల కాపర్లు దుర్గంధం వెదజల్లడాన్ని గమనించి వ్యక్తి మృతి చెందినట్టు గుర్తించి చింతపల్లి పోలీస్ స్టేషన్ కు సమాచారం చేరవేశారు. స్థానిక ఎస్సై అరుణ్ కిరణ్ సిబ్బందితో కలిసి హుటాహుటీన సంఘటన స్థలానికి చేరుకుని మృతుని వివరాలపై ఆరా తీశారు. ఎస్ఐ అరుణ్ కిరణ్ అందించిన వివరాల ప్రకారం.. మండలంలోని పెదబరడ పంచాయతీ పరిధిలోని లోతుగడ్డ జంక్షన్, చింతలూరు గ్రామాల సమీపంలోని టేకు తోట వద్ద సుమారు 40 ఏళ్ల వయసు కలిగిన గుర్తు తెలియని వ్యక్తి అనుమానస్పదంగా మృతి చెందాడన్నారు. మృతుడు నీలం రంగు జీను ప్యాంటు ధరించిచాడని ఎవరైనా గుర్తుపడితే చింతపల్లి పోలీస్ స్టేషన్‌కు వివరాలు తెలపాలని కోరారు. చింతపల్లి సర్కిల్ ఇన్స్పెక్టర్ ఫోన్: 94404239, చింతపల్లి స్టేషన్ సబ్ ఇన్స్పెక్టర్ ఫోన్:9440904238 నెంబర్లకు సమాచారం తెలపాలని కోరారు.

గుర్తు తెలియని వాహనం ఢీకొని మహిళ మృతి

ప్రజాశక్తి- ఆనందపురం : మండలంలోని పెద్దిపాలెం జాతీయ రహదారిపై ఆదివారం గుర్తు తెలియని వాహనం ఢీకొని ఒక మహిళ (50) మృతి చెందింది. స్థానికుల సమాచారంతో గ్రామ విఆర్ఓ మజ్జి శ్రీనివాసరావు పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకొని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం భీమిలి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మృతురాలు గత కొంతకాలంగా ఈ ప్రాంతంలో భిక్షాటన చేసుకుంటోందని పోలీసులకు స్థానికులు వివరించారు. కేసును సిఐ చింత వాసునాయుడు ఆధ్వర్యాన ఎస్ఐ పందిరి శివ దర్యాప్తు చేస్తున్నారు.

యువతి అదృశ్యం

ప్రజాశక్తి -మధురవాడ : పోతిన మల్లయ్యపాలెంలో యువతి అదృశ్యమైనట్లు సిఐ జి.బాలకృష్ణ తెలిపారు. జివిఎంసి 7వ వార్డు పరిధి స్వతంత్రనగర్ లక్ష్మీదేవి దేవాలయం సమీపంలో కుటుంబంతో కలిసి నివాసం ఉంటున్న డి.పావని ఈ నెల 27వ తేదీన ఇంటి నుంచి బయటకు వెళ్లి తిరిగి రాలేదు. తండి చుట్టుపక్కల, బంధువులు ఇళ్లలో వెతికినా ఫలితం లేకపోవడంతో తల్లి నాగమ్మ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు సిఐ తెలిపారు.

10 మద్యం సీసాలు స్వాధీనం

ప్రజాశక్తి-గొలుగొండ:మండలంలోని ఏఎల్ పురం పిహెచ్‌సి వద్ద అక్రమంగా బెల్టు షాపుకు తరలిస్తున్న 10 మద్యం సీసాలను పట్టుకొని చోద్యం గ్రామానికి చెందిన బోళెం సత్యనారాయణ వ్యక్తిపై కేసు నమోదు చేశామని కృష్ణదేవిపేట ఎస్సై దివ్య తెలిపారు. గ్రామాల్లో సారా తయారీ, విక్రయాలు, గంజాయి రవాణా, నిల్వలు ఉన్నట్లలైతే తమకు తక్షణమే సమాచారం ఇవ్వాలన్నారు.

పరిసరాల పరిశుభ్రత అందరి బాధ్యత

ప్రజాశక్తి-నర్సీపట్నంటౌన్: స్థానిక వాకర్స్ క్లబ్ ఆధ్వర్యంలో ఎన్టీఆర్ స్టేడియంలో ఆదివారం స్వచ్ఛతా హి సేవా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న మున్సిపల్ కమిషనర్ జంపా సురేంద్ర మాట్లాడుతూ, ప్లాస్టిక్ రహిత సమాజాన్ని తయారు చేయాలని, అందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు. ప్రజలు ఇందుకు సహకరించాలని కోరారు. పరిసరాల పరిశుభ్రతకు ప్రతి ఒక్కరూ తమ వంతుగా బాధ్యతలు తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో భాగంగా వాకర్స్ క్లబ్ సభ్యులు ప్ల కార్డులతో స్వచ్ఛమైన సమాజాన్ని నిర్మిద్దాం అంటూ నినాదాలు చేశారు.

ఫైబర్ నెట్ పనులు చేస్తూ గుండెపోటుతో వ్యక్తి మృతి

ప్రజాశక్తి-కోటవురట్ల:మండలంలో రామచంద్రపురం గ్రామంలో బిఎస్ఎన్ఎల్ ఫైబర్ నెట్ పనులు చేస్తూ కోటవురట్ల, రాట్నాలపాలెం గ్రామానికి చెందిన పెదపూడి బాలరాజు మృతి చెందాడు. కేబుల్ వైరు పనులు చేస్తూ నిచ్చెన పట్టుకుని ఉన్న సమయంలో ఒక్కసారిగా కిందపడి అపస్మారక స్థితికి చేరుకున్నాడు. స్థానికులు కోటవురట్ల కమ్యూనిటీ హెల్త్ సెంటర్ కు తీసుకువెళ్లగా అక్కడ వైద్యులు పరీక్షించి గుండెపోటుతో మరణించినట్లు నిర్ధారించారు. మృత దేహానికి పోస్టుమార్టం నిర్వహించి బంధువులకు అప్పగించారు. స్థానిక ఎస్ఐ రమేష్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేపడుతున్నారు.


విజేతలతో అతిథులు

ముగిసిన టేబుల్ టెన్నిస్ ఛాంపియన్‌షిప్

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : విశాఖపట్నం జిల్లా టేబుల్ టెన్నిస్ సంఘం ఆధ్వర్యంలో గీతం యూనివర్సిటీ వేదికగా మూడు రోజులపాటు నిర్వహించిన ఎపి స్టేట్ టేబుల్ టెన్నిస్ ఛాంపియన్‌షిప్ పోటీలు ఆదివారంతో ముగిశాయి. ముగింపు కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా హిమకర్ టాటా, డాక్టర్ విజయకుమార్ ఉపాధ్యాయ జెకె.నాయక్, పి.విశ్వనాథ్, ఆంధ్రప్రదేశ్ టేబుల్ టెన్నిస్ అసోసియేషన్ కార్యదర్శి కె.శ్రీకృష్ణమూర్తి, విశాఖపట్నం జిల్లా టేబుల్ టెన్నిస్ అసోసియేషన్ అడ్వైజర్ షణ్ముఖ, కార్యదర్శి డాక్టర్ డివిఎస్‌వై.శర్మ పాల్గొని క్రీడాకారులకు పార్టిసిపేషన్ సర్టిఫికెట్లు, విజేతలకు బహుమతులు అందించారు.

విజేతలు వీరే

అండర్ - 11 బాలుర విభాగంలో తేజ గంగడ తరుణ్, బాలికల విభాగంలో మనస్వి శీలం, అండర్ 13 బాలురు విభాగంలో వేదన్ష్ నాదెళ్ల, బాలికల విభాగంలో షేక్ ఆరిఫ్ సుల్తానా, అండర్ 15 బాలుర విభాగంలో సహస్ర సూర్య విఖ్యాత టేకుమళ్ల, బాలికల విభాగంలో ఎన్‌విఎస్‌జి.రేణుక సత్య విజేతలుగా నిలిచారు.

సమాజానికి ఆదర్శం ప్రొఫెసర్ ప్రసన్నకుమార్

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : ఆంధ్రా యూనివర్సిటీ మాజీ రెక్టార్, ప్రొఫెసర్ ఎ.ప్రసన్నకుమార్ జీవితం సమాజానికి ఆదర్శమని, ఆదర్శ ఉపాధ్యాయులలో ఆయన అగ్రగణ్యులని దేశ మాజీ ఉప రాష్ట్రపతి ఎం.వెంకయ్య నాయుడు కొనియాడారు. జిల్లా పరిషత్ దరి అంకోసా ఫంక్షన్ హాల్‌లో విశాఖ రసజ్ఞ వేదిక ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన సెంటర్ ఫర్ పాలసీ స్టడీస్ డైరెక్టర్ ప్రసన్న కుమార్ 90వ జన్మదినోత్సవ కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. ప్రసన్న కుమార్ విజ్ఞానం, జ్ఞానం అమూల్యమైనవని అన్నారు.

మూడు తరాలు దాటి నాలుగో తరానికి విద్యనందిస్తున్న విద్యావేత్త అని కొనియాడారు. ప్రసన్న కుమార్ విజ్ఞానానికి భాషా పరిజ్ఞానాన్ని జోడించి సేవలందిస్తున్నారని తెలిపారు. ఎయులో విధులు నిర్వహించినప్పుడు పొలిటికల్ సైన్స్‌లో వేలాది మంది విద్యార్థులను ఉన్నతంగా తీర్చిదిద్దారన్నారు. విశిష్ట అతిథిగా పాల్గొన్న మిజోరం రాష్ట్ర గవర్నర్ డాక్టర్ కంభంపాటి హరిబాబు మాట్లాడుతూ విద్యారంగంలో ప్రొఫెసర్ ప్రసన్న కుమార్ చేసిన సేవలను సమాజం ఎప్పటికీ గుర్తుంచుకుంటుందన్నారు. కార్యక్రమానికి విశాఖ రసజ్ఞ వేదిక అధ్యక్షులు డాక్టర్ జి రఘురామారావు అధ్యక్షత వహించారు. నాగార్జున యూనివర్సిటీ మాజీ వైస్ ఛాన్సలర్ వి.బాలమోహన్ దాస్, లీడర్ సంపాదకులు వివి.రమణమూర్తి, గండికోట గోపాల్ తదితరులు పాల్గొన్నారు.

గంజాయి చాక్లెట్లు స్వాధీనం

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : విశాఖపట్నం సిటీ టాస్క్‌ఫోర్స్ అధికారులు నగరంలో గంజాయి చాక్లెట్లను ఆదివారం స్వాధీనం చేసుకున్నారు. ఓ వ్యక్తిని అరెస్టు చేశారు. వారి కథనం మేరకు టూ టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలోగల పూర్ణా మార్కెట్ క్రాంతి థియేటర్‌కు ఎదురుగా ఉన్న పాన్ షాపులో ఆదివారం పోలీసులు తనిఖీలు నిర్వహించారు. 133 గంజాయి చాక్లెట్లు (660 గ్రాములు) స్వాధీనం చేసుకొని, నిందితుడు మనోజ్ కుమార్ చౌదరిని అరెస్ట్ చేశారు. అతనిపై ఎన్‌డిపిఎస్ యాక్ట్ ప్రకారం కేసు నమోదు చేశారు. తనిఖీల్లో పాల్గొన్న టాస్క్‌ఫోర్స్ సబ్ ఇన్‌స్పెక్టర్ భరత్, టూ టౌన్ సబ్ ఇన్‌స్పెక్టర్ శంకర్, ఇతర పోలీసు సిబ్బందిని నగర పోలీస్ కమిషనర్ డాక్టర్ శంఖబ్రత బాగ్చి అభినందించారు.

స్టీల్‌ప్లాంట్‌ను పూర్తి సామర్థ్యంతో నడపాలి

సెయిల్‌లో విలీనం చేయాలి

విశాఖ అఖిలపక్ష కార్మిక, ప్రజా సంఘాల జెఎసి డిమాండ్

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : విశాఖ స్టీల్‌ప్లాంట్‌ను సెయిల్‌లో విలీనం చేసి, పూర్తి స్థాయి సామర్థ్యంతో నడిపించాలని విశాఖ అఖిలపక్ష కార్మిక, ప్రజా సంఘాల జెఎసి రౌండ్ టేబుల్ సమావేశం తీర్మానించింది. సిఐటియు విశాఖ జిల్లా కార్యాలయంలో ఆదివారం జరిగిన జెఎసి సమావేశంలో జెఎసి చైర్మన్ ఎం.జగ్గునాయుడు ప్రవేశపెట్టిన పలు తీర్మానాలను సమావేశం ఏకగ్రీవంగా ఆమోదించింది. ఈ సందర్భంగా జగ్గునాయుడు, జెఎసి నాయకులు మాట్లాడుతూ స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణ జరగదు, దీనిని అభివృద్ధి బాట పట్టిస్తామని కేంద్ర మంత్రులు, రాష్ట్ర ముఖ్యమంత్రి, ఉప ముఖ్యమంత్రి, మంత్రులు, ప్రజాప్రతినిధులు నిరంతరం ప్రకటనలు చేస్తున్నారన్నారు. కానీ ఆచరణ దీనికి పూర్తి విరుద్ధంగా ఉందని తెలిపారు. విశాఖ ఉక్కును కేంద్రంలోని మోడీ ప్రభుత్వం రోజురోజుకూ తీవ్రంగా దెబ్బతీస్తోందన్నారు. సొంత గనులు, రామెటీరియల్, వర్కింగ్ క్యాపిటల్ ఇవ్వకుండా ఉత్పత్తికి ఆటంకాలు సృష్టిస్తోందని, కావాలనే నష్టాల్లోకి నెడుతోందని తెలిపారు. ఉద్యోగులకు, కార్మికులకు జీతాలు సరిగా ఇవ్వడం లేదన్నారు. పర్మినెంట్ ఉద్యోగుల తగ్గింపు, కాంట్రాక్ట్ కార్మికుల తొలగింపునకు పూనుకుంటోందన్నారు. నిర్వాసితులకు ఉద్యోగాలు ఇవ్వడం లేదన్నారు. నానాటికీ ప్రైవేటీకరణ కుట్రలు పెరుగుతున్నాయన్నారు. కేంద్ర మోడీ ప్రభుత్వ పాలనకు రాష్ట్రంలోని టిడిపి, జనసేన కూటమి ఆక్సిజన్‌ను అందిస్తూ అత్యంత కీలక స్థానంలో ఉన్నాయన్నారు. స్టీల్‌ప్లాంట్ పూర్తిగా మునిగిపోక ముందే కూటమి అధినేతలు చంద్రబాబు, పవన్ కల్యాణ్ తక్షణమే రంగంలోకి దిగి మోడీ ప్రభుత్వంపై ఒత్తిడి తేవాలన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న జగ్గునాయుడు

1, 2, 3 తేదీల్లో నిరాహార దీక్షలను జయప్రదం చేయండి

స్టీల్‌ప్లాంట్ రక్షణకు అక్టోబర్ 1, 2, 3 తేదీల్లో రాష్ట్ర వ్యాప్తంగా జరిగే నిరాహార దీక్షలను జయప్రదం చేయాలని కోరారు. విశాఖలో జరిగే దీక్షల్లో ఒకటో తేదీన విద్యార్థి, యువజన, దళిత, గిరిజన, సామాజిక సంఘాలు పాల్గొంటాయని, 2వ తేదీ దీక్షల్లో కార్మిక, పెన్షనర్ల సంఘాలు పాల్గొంటాయని, 3వ తేదీ దీక్షల్లో మహిళా, ఇతర ప్రజా సంఘాలు పాల్గొంటాయని తెలిపారు. 2వ తేదీన నగరంలో వివి.రమణమూర్తి సారథ్యంలో నిర్వహించే విశాఖ ఉక్కు రక్షణ ప్రదర్శనకు జెఎసి మద్దతు తెలిపింది. రౌండ్ టేబుల్ సమావేశంలో ఐఎన్‌టియుసి జిల్లా ప్రధాన కార్యదర్శి భోగవిల్లి నాగభూషణం, సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్‌కెఎస్‌వి.కుమార్, సిఎఫ్‌టియుఐ జాతీయ అధ్యక్షులు ఎన్.కనకారావు, టిఎన్‌టియుసి జిల్లా ఆర్గనైజింగ్ కార్యదర్శి ఉప్పిలి రామకృష్ణ, ఎఐసిటియు జిల్లా కార్యదర్శి కె.శంకర్రావు, డిహెచ్‌పిఎస్ రాష్ట్ర అధ్యక్షులు జెవి.ప్రభాకర్, రాజు, కెవిపిఎస్ జిల్లా అధ్యక్షులు ఎం. సుబ్బన్న, కార్యదర్శి టి.చిరంజీవి, ఐద్వా జిల్లా నాయకులు కె.కుమారి, డివైఎఫ్‌ఐ జిల్లా కార్యదర్శి కె.సంతోష్ కుమార్, ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి ఎల్‌జె.నాయుడు, ఉత్తరాంధ్ర బహుజన శక్తి అధ్యక్షులు ఎం.చిరంజీవి, జివిఎంసి కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ (సిఐటియు) నాయకులు పి.వెంకట రెడ్డి, ఉరుకూటి రాజు, టి.నూకరాజు, ప్రజానాట్య మండలి జిల్లా కార్యదర్శి ఎం.చంటి పాల్గొన్నారు.

స్టీల్‌ప్లాంట్ ఇన్‌ఛార్జి సిఎమ్‌డిగా అజిత్ కుమార్ సక్సేనా

ప్రజాశక్తి - ఉక్కునగరం : ఉక్కు మంత్రిత్వ శాఖ విశాఖపట్నం స్టీల్‌ప్లాంట్ ఇన్‌ఛార్జి సిఎమ్‌డిగా అజిత్ కుమార్ సక్సేనాకు తాత్కాలికంగా బాధ్యతలు అప్పగించింది. ది ఫెర్టిలైజర్స్ అండ్ కెమికల్స్ ట్రావెన్‌కోర్ లిమిటెడ్ (ఫైనాన్స్) డైరెక్టర్ ఎస్.శక్తిమణి ప్రస్తుత స్టీల్‌ప్లాంట్ సిఎమ్‌డి అతుల్‌భట్ నవంబర్ 30వ తేదీన రిటైర్ అయిన తర్వాత బాధ్యతలు చేపట్టాల్సి ఉంది. అయితే, అతుల్ భట్ ఈ ఏడాది నవంబర్ చివరి వరకూ అంటే ఉద్యోగ విరమణ చేసే వరకు సెలవుపై వెళ్లారు. తప్పని పరిస్థితుల్లో డైరెక్టర్ ప్రాజెక్ట్స్‌గా పని చేస్తున్న ఎకె.బాగ్చి ఇన్‌ఛార్జి సిఎమ్‌డిగా ప్రస్తుతం బాధ్యతలు చూస్తున్నారు. అతుల్‌భట్ స్టీల్‌ప్లాంట్‌ను సమర్థవంతంగా నడిపించడంలో విఫలమైనట్టుగా కేంద్రం భావిస్తోంది. ఈ క్రమంలో ఉక్కు కర్మాగారంలో జరుగుతున్న పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని ఉన్నత అధికారికి అదనపు బాధ్యతలు అప్పగించాలని అజిత్ కుమార్ సక్సేనాను తెరపైకి తెచ్చినట్టు తెలుస్తోంది.

గతంలో ఆయన ఆపరేషన్ డైరెక్టర్‌గా పని చేశారు. మాంగనీస్ లిమిటెడ్ సిఎమ్‌డిగా బదిలీపై వెళ్లారు. మళ్లీ స్టీల్ ప్లాంట్‌కు ఆయన ఇప్పుడు తిరిగి రావడం చర్చనీయాంశమవుతోంది. పూర్తిస్థాయి సిఎమ్‌డి వచ్చే వరకూ సక్సేనా కొనసాగుతారని ఆదివారం కేంద్రం జారీ చేసిన ఉత్తర్వుల్లో పేర్కొంది.

దేశ గతిని మార్చేది ఉపాధ్యాయులే..

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : దేశ గతిని మార్చే శక్తి టీచర్లకు మాత్రమే ఉందని భీమిలి ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు అన్నారు. ఆంధ్రా యూనివర్సిటీలోని డాక్టర్ వైవిఎస్.మూర్తి ఆడిటోరియంలో ఆదివారం జరిగిన ఎపి ప్రైవేట్ అన్ ఎయిడెడ్ స్కూల్ మేనేజ్మెంట్ అసోసియేషన్ టీచర్ అవార్డ్స్ ప్రదాన కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ దేశానికి మంచి పౌరులను అందించడంలో టీచర్లదే కీలక పాత్ర అన్నారు. ఉత్తమ టీచర్ల అవార్డులు అందుకున్న టీచర్లకు అభినందనలు తెలియజేశారు. కార్యక్రమంలో నన్నయ్య యూనివర్సిటీ మాజీ వీసీ ముర్రు ముత్యాలనాయుడు, అసోసియేషన్ ప్రతినిధులు పాల్గొన్నారు.


షిప్‌యార్డు స్థితిని సంజీవ్ కుమార్‌కు వివరిస్తున్న అధికారులు

షిప్ యార్డ్‌లో డిఫెన్స్ ప్రొడక్షన్ సెక్రటరీ పర్యటన

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : డిఫెన్స్ ప్రొడక్షన్ సెక్రటరీ సంజీవ్ కుమార్ ఆదివారం ఉదయం విశాఖపట్నంలోని హిందుస్థాన్ షిప్‌యార్డు లిమిటెడ్‌ను సందర్శించారు. ఈ సందర్భంగా అక్కడున్న మౌలిక సదుపాయాలను పరిశీలించారు. పనులను సకాలంలో పూర్తి చేయడానికి, భవిష్యత్తు ప్రణాళికల కోసం ప్రాజెక్టులు నిర్వహించడానికి అవలంబిస్తున్న ప్రోయాక్టవ్ విధానాన్ని, గోల్ విజన్ వైపు హిందుస్థాన్ షిప్ యార్డ్ లిమిటెడ్ చేస్తున్న ప్రయత్నాలను అభినందించారు. మూలధన వ్యయాన్ని మెరుగుపరచాలని, పరిశోధన, అభివృద్ధిలలో పెట్టుబడులు పెట్టాలని, పరిశ్రమ 4.0 టెక్నాలజీ ఉపయోగం పెంచాలని అధికారులకు సూచించారు. మేక్ ఇన్ ఇండియా కింద రాబోయే రక్షణ, వాణిజ్య ప్రాజెక్టులను చురుగ్గా కొనసాగించాలని ఆయన హిందుస్థాన్ షిప్ లిమిటెడ్ బృందానికి సూచించారు. అనంతరం జరిగిన కార్యక్రమంలో సీనియర్ మేనేజ్మెంట్ బృందానికి స్ఫూర్తిదాయకమైన సూచనలు ఇస్తూ ఉద్యోగులను చైతన్య పరిచారు.

సమస్యలపై వినతి

హిందూస్తాన్ షిప్ యార్డ్ లిమిటెడ్, హిందుస్థాన్ ఏరోనాటిక్స్ లిమిటెడ్‌ల పర్యటన నిమిత్తం ఆదివారం విశాఖపట్నం వచ్చిన సంజీవ్ కుమార్‌కు హెచ్‌ఎస్ఎల్ లేబర్ అండ్ స్టాఫ్ యూనియన్ (సిఐటియు) నాయకులు సమస్యలపై వినతిపత్రం అందజేశారు. 5 ఎఫ్ఎస్ఎస్ నౌకల నిర్మాణం షిప్‌యార్డులో చేపట్టే విధంగా చర్యలు తీసుకోవాలని, దేశ రక్షణకు అవసరమైన ఎల్‌పిడిలు, రీసెర్చ్‌కి అవసరమైన షిప్పులు, ఇతర డిఫెన్స్ వర్క్ ఆర్డర్స్‌ను షిప్ యార్డ్‌కు ఇవ్వాలని కోరారు. 372 మంది ఎల్ అండ్ ఎం సిరీస్ కార్మికులను శాశ్వత ప్రాతిపదికన తీసుకోవాలని, 5 ఎఫ్ఎస్ఎస్ పోర్టు లీజ్ స్థలం షిప్‌యార్డ్‌కు చెందేలా చూడాలని విన్నవించారు. రిటైర్డ్ ఉద్యోగులను సమస్యలను పరిష్కరించాలన్నారు. కార్యక్రమంలో యూనియన్ గౌరవ అధ్యక్షులు జానకిరామ్, ప్రధాన కార్యదర్శి ఎస్.ప్రసాద్, కోశాధికారి పివి.ప్రసాద్, సిఐటియు విశాఖ జిల్లా ఉపాధ్యక్షులు కె.కుమార్ మంగళం ఉన్నారు.

విశాఖ కేంద్రంగా రైల్వేజోన్‌కు హైడ్రామాల ప్రహసనం ముగిసినట్టేనా ?

ప్రజాశక్తి - గ్రేటర్ విశాఖ బ్యూరో

విశాఖ కేంద్రంగా దక్షిణ కోస్తా రైల్వే (సౌత్ కోస్ట్) జోన్‌కు కేంద్రం కొర్రీల పర్వం ముగిసినట్టేనా ?... అంటే అవుననే సమాధానం రైల్వే ఉన్నతాధికారుల నుంచి తాజాగా వినిపిస్తోంది. జోన్ కోసం అవసరమైన 52 ఎకరాలూ రాష్ట్ర ప్రభుత్వం నుంచి హ్యాండోవర్ కాలేదంటూ మోడీ సర్కారు 2019 నుంచీ చెప్పుకొచ్చిన సంగతి తెలిసిందే. వాస్తవానికి 2014 నాటి మోడీ ఎన్నికల హామీ ఇది. పలు మార్లు ఇదిగో శంకుస్థాపన, భూమి పూజ అంటూ 2019 ఫిబ్రవరి 27న కేంద్రం రైల్వే జోన్ ఏర్పాటును ప్రకటించింది. ఆ ఎన్నికల ముందూ ఆయుధంగా వాడుకుంది. 2023 మార్చి నాటికి జోన్‌కు పునాదిరాయి పడుతుందని ఢిల్లీ పెద్దలు భరోసా ఇచ్చారు. 2024 ఎన్నికల్లో బిజెపి పెద్దలు విశాఖ రైల్వే గ్రౌండ్స్‌లో సభ జరిపి హామీని తిరగదోడారు. ఇలా అనేక హైడ్రామాల అనంతరం ఇప్పుడు ఈ అంశం కాసింత కదిలిందనే చెప్పాలి. నగరంలోని ముడసర్లోవ ప్రాంతంలో గతంలో చూపించిన భూమి వివాదంలో ఉందని, చెరువు, లోతట్టు ప్రాంతమని వివాదం సృష్టించిన ఢిల్లీ సర్కారు తాజాగా ఒక మెట్టు దిగి వచ్చిందనే చెపొచ్చు. అక్కడ భూమినే కేంద్రం అంగీకరించింది. 52 ఎకరాలనూ 2023లోనే రాష్ట్ర ప్రభుత్వం చూపించగా తాజాగా దీనికి కేంద్ర పెద్దలు ఓకే చెప్పారు. దీంతో రైల్వే అధికారులు సైతం పనులు చేపట్టేందుకు సన్నద్ధమవుతున్నారు. జోన్ పనులు ఈ ఏడాది దసరా, దీపావళి సమయంలో మంచి రోజున ప్రారంభం కానున్నట్టు 'ప్రజాశక్తి'కి తెలిపారు.